సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 10 । జూలై । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 27.206 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 90.751 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.60,700
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,451
3శాతం జీఎస్టీతో	రూ.5,615
నవర (8గ్రా)	రూ.44,920

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.0 /29.0

ఆదివారం గాలిలో తేమ 41 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు కాస్త పెరిగాయి. సోమవారం ఎండ తీవ్రత ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

భారీగా బొగ్గు దిగుమతి



థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు తరలిస్తున్న కన్వేయర్లు

ముత్తుకూరు: కృష్ణపట్నంపోర్టు ద్వారా థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలకు అవసరమైన బొగ్గు పెద్ద ఎత్తున దిగుమతి జరుగుతున్నట్టు పోర్టు ఉన్నతోద్యోగి ఒకరు ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా లైలా నాంటంగ్ అనే నౌక ద్వారా 1.27 లక్షల టన్నుల బొగ్గు దిగుమతి జరుగుతున్నట్టు వెల్లడించారు. అలాగే, సియా అనే నౌక నుంచి 74,000 టన్నులు, యునిటి ఎస్ అనే నౌక ఉంచి 74,000 టన్నులు, దుబాయ్ గలాక్టిక్ అనే నౌక నుంచి 30,000 టన్నుల బొగ్గు దిగుమతి చేసుకొంటున్నారు. మరో వైపు మారో కే అనే నౌక 44,000 టన్నుల డీఏపీ దిగుమతి చేసేందుకు సిద్ధంగా ఉంది.

మాజీ ఉపరాష్ట్రపతి సేవలను ప్రశంసిస్తూ న్యూజెర్సీలో తీర్మానం



నెల్లూరు(దర్గామిట్ట): మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు వివిధ రంగాల్లో చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ న్యూజెర్సీ రాష్ట్ర అసెంబ్లీ, సెనేట్‌లో తీర్మానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా అరుదైన గౌరవం లభించింది. సెనేటర్ దయాగ్నస్, జనరల్ అసెంబ్లీ సభ్యులు కారా బిన్సక్, స్టేన్లి సంయుక్త తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని సెనేట్ ప్రెసిడెంట్ నికోలస్ పి స్కటారి, జనరల్ అసెంబ్లీ స్పీకర్ కైగ్ జె కప్లిన్‌లు ఆమోదించారు. ఆయన న్యూజెర్సీ, అమెరికా వ్యాప్తంగా ప్రవాస భారతీయుల ప్రయోజనాల కోసం, సమాజంలో మార్పు కోసం విశేషంగా కృషి చేశారు. భారత్, అమెరికా మధ్య సంస్కృతిక వాణిజ్య సంబంధాల బలోపేతానికి చేసిన కృషిని తీర్మానంలో ప్రశంసించారు. 23వ తానా మహాసభల్లో న్యూజెర్సీ జనరల్ తీర్మాన పత్రాన్ని వెంకయ్యనాయుడుకు అందజేసినట్లు ఆదివారం సమాచార పౌరసంబంధాలశాఖ నెల్లూరు జిల్లా అధికారులు ప్రకటన విడుదల చేశారు.

సమస్యల పరిష్కారానికి నిధుల కేటాయింపు

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



బుక్‌లెట్ అందజేస్తున్న ఎంపీ ఆదాల

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి అధికంగా నిధులు కేటాయిస్తున్నట్లు నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూరల్ పరిధిలోని 23వ డివిజన్‌లో ఉన్న శిరోమణి నగర్, కావేరి నగర్ ప్రాంతాల్లో ఆదివారం సాయంత్ర గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల వల్ల జరిగిన లబ్ధిని వివరించారు. బుక్‌లెట్లు పంపిణీ చేశారు. స్థానికులు ఎంపీ దృష్టికి సమస్యలను తీసుకెళ్లగా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని ప్రజలు ఆదరించాలని కోరారు. రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికంగా నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవార్డులకు దరఖాస్తులు

నెల్లూరు (వేదాయపాళెం): సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వ శాఖ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థల నుంచి అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అక్బర్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్ www.awardr.gov.in లో ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిబంధనల మేరకు ఎంపికైన వారికి డిసెంబర్ 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం రోజున అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.


ఊర్లోనే రిజిస్ట్రేషన్లు

రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. త్వరితగతిన రిజిస్ట్రేషన్లను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంది. అందులో భాగంగా జిల్లాలోని కొన్ని సచివాలయాల్లో ఈ ప్రక్రియను ప్రారంభించింది. ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

- భూ సమగ్ర సర్వే పూర్తయిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు
- చర్యలు తీసుకున్న ప్రభుత్వం
- గ్రామీణ సచివాలయాల్లో ప్రారంభం
- ప్రజలకు విస్తృతంగా అవగాహన

ఇప్పటి వరకు..

ఎన్ని సచివాలయాల్లో :	101
జరిగిన రిజిస్ట్రేషన్లు :	153
ప్రభుత్వానికి ఆదాయం.	రూ.12.48 లక్షలు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలోని వివిధ మండలాల్లో మొత్తం 101 గ్రామీణ సచివాలయాల్లో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. భూముల రీసర్వే పూర్తి చేసుకున్న సచివాలయాల పరిధిలో మాత్రమే దీనిని మొదలు పెట్టారు. 2022 సంవత్సరం నవంబర్ 23వ తేదీన సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో మూడు, రెండో విడతలో 97 సచివాలయాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ప్రజలకు సులువుగా రిజిస్ట్రేషన్లు చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేసింది. జిల్లా రిజిస్ట్రేషన్ అధికారులు కూడా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని చర్యలు తీసుకున్నారు.

ఏం జరుగుతుందంటే..

స్థిర, చరాస్తుల విక్రయం, కొనుగోళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాల్సిందే. ఈ క్రమంలో అక్కడున్న డాక్యుమెంట్ రైటర్లు దళారులు నిర్ణయించిన ధర చెల్లించాల్సి వచ్చేది. లేని పక్షంలో డాక్యుమెంట్లు సక్రమంగా లేవంటూ కొర్రీలు పెట్టేవాళ్లు. అక్రమాలను అరికట్టి రిజిస్ట్రేషన్ ప్రక్రియను గ్రామీణ ప్రాంతాలకే చేరువ చేసేందుకు ప్రభుత్వం గ్రామీణ సచివాలయాల్లోనే ఈ సేవలు ప్రారంభించింది. భూముల అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించిన లావాదేవీలన్నీ సచివాలయ కేంద్రంగానే చేపట్టేలా ఆదేశాలిచ్చింది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేసింది. ఈ ప్రక్రియ సమర్థవంతంగా జరగాలంటే భూముల వివాదాలు ఉండకూడదని భావించింది. సమగ్ర భూ సర్వే పూర్తయిన గ్రామాల్లో అయితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని అక్కడ ప్రారంభించారు

రికార్డు స్థాయిలో..

జిల్లాలోని 101 గ్రామీణ సచివాలయాల్లో మొత్తం 153 రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. సచివాలయ కార్యదర్శులకు అవగాహన కల్పించి ఎలా రిజిస్ట్రేషన్ చేయాలో ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో శిక్షణ ఇచ్చారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పంచేడు గ్రామ సచివాలయంలో అధికంగా 9 రిజిస్ట్రేషన్లు చేశారు.

ప్రజలకు సులువుగా ఉంటుంది



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కొన్ని సచివాలయాల్లో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేస్తున్నాం. ప్రజలకు సులువైన పద్ధతిలో నాణ్యమైన సేవలు అందిస్తున్నాం. భారీ నగదును ట్రాన్స్‌పోర్ట్ చేసి ఇబ్బందులు పడకుండా ప్రజలు స్థానిక సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలు కల్పించాం.

– బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్

సిబ్బందికి అవగాహన

రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై గ్రామ సచివాలయ సిబ్బందికి జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ప్రత్యేక సదస్సులు పెట్టి డాక్యుమెంట్ల పరిశీలన, చలానా తదితర విషయాలపై సమగ్ర సమాచారం అందించారు. ఇది వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందే సేవలన్నీ సచివాలయాలకు అనుసంధానం చేశారు. అక్నాలెడ్జ్‌మెంట్ ఆఫ్ డేట్, డేటా ఫీడింగ్, చెక్ స్లిప్ రెగ్యులర్ నంబర్ కేటాయింపు, ఫొటో, వేలిముద్రలు తీసుకోవడం, డాక్యుమెంట్ ప్రింటింగ్, స్కానింగ్ దస్తావేజు, సెటిల్‌మెంట్ దస్తావేజు, దాన, విక్రయ తనఖా, చెల్లు రశీదు, భాగస్వామ్య పరిష్కార రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, వివాహ రిజిస్ట్రేషన్ తదితర సేవలు ఊర్లలోనే అందుతాయి.

ఫోర్జరీ సంతకాలతో రూ.1.40 కోట్లు స్వాహా

- రూ.1.36 కోట్లు స్వాధీనం
- వ్యసనాలకు బానిసై హోంగార్డు చేతివాటం

నెల్లూరు(క్రైమ్): వ్యసనాలకు బానిసైన ఓ హోంగార్డు అక్రమాలకు తెరలేపాడు. ఏకంగా అధికారులు, సిబ్బంది సంతకాలను ఫోర్జరీ చేసి రూ.1.40 కోట్లు స్వాహా చేసి జైలుపాలైన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. నెల్లూరు నగరానికి చెందిన ఉత్పన్‌నాథ్ రాజ్ నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో బి-సెక్షన్‌లోని అధికారులకు సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. వ్యసనాలకు బానిసైన ఆయన అప్పులపాలయ్యాడు. ఎలాగైనా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. అందులో భాగంగా పోలీసుశాఖకు చెందిన చెక్కులు, వాటి తాలూకు పత్రాలపై సంతకాలను ఫోర్జరీ చేసి ట్రెజరీ, బ్యాంకుల నుంచి నగదు తన వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నాడు. ఇటీవల నిర్వహించిన తనిఖీలతోపాటు, ఉద్యోగ విరమణ పొందిన ఓ అధికారికి ఇచ్చిన చెక్ బౌన్స్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. దీంతో పోలీసు అధికారులు రహస్య విచారణ చేపట్టారు. విచారణలో హోంగార్డు ఫోర్జరీ సంతకాలతో సుమారు రూ.1.40 కోట్ల మేర నగదును స్వాహా చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై దర్గామిట్ట పోలీసులు హోంగార్డుపై కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సమాచారం. సదరు హోంగార్డు బ్యాంకు ఖాతా నుంచి రూ.1.36 కోట్ల నగదును రికవరీ చేసినట్లు తెలిసింది. ఈ కేసులో ఇంకా ఎవరి ప్రమేయమైనా ఉందా అన్న కోణాల్లో పోలీసులు క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలియజేస్తామని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

టీడీపీలో బీద రాజకీయ కల్లోలం

కావలి టీడీపీ ఆది నుంచి చుక్కాని లేని నావలా ఉంది. ఆ పార్టీ ఆవిర్భావం నుంచి రెండుసార్లు మాత్రమే కావలిలో గెలిచింది. జిల్లాలో నియోజకవర్గాల పునర్విభజనకు ముందు ఒకసారి, తర్వాత మరోసారి మాత్రమే అత్తెసరు ఓట్లతో టీడీపీ నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. గత సార్వత్రిక ఎన్నికల తర్వాత నుంచి ఆ పార్టీ రాజకీయ కల్లోలాన్ని ఎదుర్కొంటోంది. ఈ తరుణంలో పార్టీని నడిపించేందుకు బీద రవిచంద్ర రాజకీయ డ్రామాకు తెర తీశారు. నాలుగేళ్లుగా పార్టీని నడిపించేందుకు మాలేపాటిని వాడుకున్నారు. ఎమ్మెల్యే టికెట్ ఆశ చూపి పార్టీకి ఫండ్ ఇప్పించి కావ్యను ఊరించారు. చివరికి రవిచంద్ర భార్య జ్యోతిని ఎంట్రీ చేయించి ట్విస్ట్ ఇచ్చాడు. తాజా పరిణామాలు ఆ పార్టీలో లుకలుకలు బయటపడుతున్నాయి. నేటి లోకేశ్ బహిరంగ సభకు జన సమీకరణపై అయోమయం నెలకొంది.

- నిన్నటి వరకు టికెట్ మీకే అంటూ బీద తెరవెనుక రాజకీయం
- కావలి టికెట్ కోసం కావ్య, మాలేపాటి భారీగా ఖర్చు
- లోకేశ్ యాత్రలో బీద జ్యోతి ఎంట్రీతో అయోమయం

కావలి: ఉనికి కోల్పోయిన టీడీపీని బతికించాలని లోకేశ్ చేస్తున్న యువగళం పాదయాత్రతో కావలిలో ఆ పార్టీ పూర్తిగా కనుమరుగైపోయే పరిస్థితి కనిపిస్తోంది. 2004లో జరిగిన సార్వత్రిక ఎన్నికలతో బీద సోదరులు రాజకీయంగా లైమ్‌లైట్లోకి వచ్చారు. టీడీపీలో బీద మస్తాన్‌రావు అండతో ఆయన సోదరుడు బీద రవిచంద్ర రాజకీయంగా ఎదిగాడు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతూ పార్టీ విజయాలను తన విజయాలుగా భ్రమింపచేశారు. 2009లో బీద మస్తాన్‌రావు ఎమ్మెల్యే అయినప్పటికీ వ్యాపార వ్యవహారాల్లో తలమునకలై ఉండడంతో బీద రవిచంద్ర కావలిలో షాడో ఎమ్మెల్యేగా హడావుడి చేశాడు. ఆ సమయంలోనే రవిచంద్ర నియోజకవర్గంలో తన కోటరీని సృష్టించుకున్నాడు. కావలి టికెట్‌పై ఆశలు పెంచుకుని 2014 ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నాలు చేశాడు. అయితే టికెట్ తన సోదరుడు బీద మస్తాన్‌రావుకే ఇవ్వడంతో పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీ పదవిని ఇస్తానని హామీ ఇవ్వడంతో మిన్నకుండిపోయాడు. ఆ ఎన్నికల్లో బీద మస్తాన్‌రావు ఓటమి పాలయ్యారు. 2019 ఎన్నికల్లో కూడా తన సతీమణిని బరిలోకి దింపాలని తెరవెనుక రాజకీయం నెరిపినా.. చివరికి మస్తాన్‌రావు తన పలుకుబడి ఉపయోగించి కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిని బరిలోకి దింపడంతో రవిచంద్ర ఆశలు ఆవిరయ్యాయి. ఆ తర్వాత బీద మస్తాన్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి పార్టీకి దూరం కావడంతో కావలి బాధ్యతలను రవిచంద్రకు అప్పగించారు.

2019లో ఓటమి తర్వాత..

గత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలు కావడం, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది. ఈ దశలో పార్టీని నడిపించేందుకు మాలేపాటిని కావలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించి రాబోయే ఎన్నికల్లో టికెట్ నీదేనంటూ నాలుగేళ్లుగా వాడుకున్నాడు. అయినప్పటికీ పెత్తనమంతా బీద తన చెప్పు చేతుల్లోనే పెట్టుకున్నాడు.

కావ్యకు టికెట్ ఆశలు

తన జీవితంలో ఒక్కసారైనా ఎమ్మెల్యే కాకపోయినా.. కనీసం ఎమ్మెల్యే అభ్యర్థిని అనిపించుకోవాలని తహతహలాడుతున్న దగుమాటి వెంకటకృష్ణారెడ్డి (కావ్య కృష్ణారెడ్డి) ఈ పార్టీ.. ఆ పార్టీ అని తేడా అన్ని పార్టీల్లో ప్రయత్నించారు. ఇతను అయితే పార్టీకి ఉపయోగపడుతాడు.. చివరి వరకు వాడుకోవచ్చునని పార్టీ పెద్దలతో మాట్లాడించి అతనికి టికెట్ ఆశలు రేపాడు. దీంతో కావ్య కృష్ణారెడ్డి చేత పార్టీకి మహానాడులో ఫండ్ ఇప్పించాడు. కావలి టికెట్ తనకే అంటూ ఇటు మాలేపాటి, అటు కావ్య ఇద్దరూ ఎవరికి వారు ప్రచారం చేసుకుంటున్నా.. అధిష్టానం నుంచి ఎటువంటి స్పష్టత లేదు.

యువగళంలో బీద సతీమణి ఎంట్రీ ట్విస్ట్

కావలిలో లోకేశ్ పాదయాత్రను విజయవంతం చేయడానికి రవిచంద్ర పెట్టిన సమావేశంలో మాలేపాటి సుబ్బానాయుడు అంతా భారం తనపైనే వేయాలని, ఏ ఒక్కరిని భాగస్వామ్యం చేయొద్దని ఖరాఖండిగా చెప్పారు. లోకేశ్ పాదయాత్ర ఏర్పాట్లు, ఖర్చు అంతా కూడా మాలేపాటి చూసుకుంటారు, ఎవరూ ఎక్కడా జోక్యం చేసుకోవద్దని నాయకులకు చెప్పేశాడు. దీంతో వీరిద్దరూ సైలెంట్ అయిపోయారు. లోకేశ్ యాత్ర కావలి నియోజకవర్గంలోకి అడుగుపెట్టే సమయానికి కాలు బాధతో రెస్ట్‌లో ఉన్న బీద తన సతీమణి జ్యోతిని ఎంట్రీ చేయించారు. లోకేశ్ యాత్రలో ఆమె అంతా తానై వ్యవహరిస్తుండడంతో అంతా అయోమయం నెలకొంది. గతంలోనే తన సతీమణికి టికెట్ ఇప్పించుకోవాలని చూశారు. కావ్య, పసుపులేటి కేవలం టికెట్ ఇస్తేనే ఉంటారు.. లేదంటే బయటకు పోతారు. కానీ పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న రవిచంద్రను కాదని మరెవరికి టికెట్‌వచ్చే అవకాశం లేదని ఆ పార్టీ నేతలే చెప్పుకుంటున్నారు. రాబోయే ఎన్నికల్లో తన సతీమణిని రంగంలోకి దింపడానికే యువగళంలో బీద జ్యోతిని ఎంట్రీ ఇప్పించాడని ప్రచారం. అయితే సోమవారం కావలిలో లోకేశ్ బహిరంగ సభకు జన సమీకరణకు ఉత్సాహంగా ఉన్న నేతలు ఇప్పుడు ముఖం చాటేస్తున్నారు. నేటి లోకేశ్ సభ పరిస్థితిపై అయోమయం నెలకొంది.

ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తికి ఘనస్వాగతం



జస్టిస్ శేషసాయి, జస్టిస్ రమేష్ దంపతులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

- జిల్లా కోర్టు ఆవరణలో నూతన భవన సముదాయం ప్రారంభం

నెల్లూరు(లీగల్): నగరంలోని మద్రాస్ బస్టాండ్ సమీపంలో ఉన్న జిల్లా కోర్టు ఆవరణలో నూతనంగా నిర్మించిన న్యాయస్థాన భవన సముదాయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి విచ్చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ శేషసాయి దంపతులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్‌తోపాటు పలువురు సీనియర్ న్యాయవాదులు ఘనస్వాగతం పలికారు. జస్టిస్ శేషసాయి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం ఆయన కోర్టు భవన సముదాయం శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం నూతన భవన సముదాయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రమేష్ దంపతులు కూడా హాజరయ్యారు. రాష్ట్ర బార్‌కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, జిల్లాలోని వివిధ కోర్టుల న్యాయమూర్తులు, పలువురు డీఎస్పీలు, ప్రభుత్వ ప్లీడర్లు, అదనపు ప్రభుత్వ ప్లీడర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న జస్టిస్ శేషసాయి

ఆడబిడ్డపై అలుసెందుకు?



భ్రూణహత్యలు నివారించి బాలికల నిష్పత్తిని పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలను చేపడుతున్నా పరిస్థితుల్లో మాత్రం మార్పు రావడంలేదు. గర్భస్థ పిండ లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని తెలిసినా కొందరు యథేచ్ఛగా స్కానింగ్ కేంద్రాల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఆడ శిశువు అని తెలియగానే అబార్షన్ చేయించుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. ఫలితంగా జిల్లాలో బాలికల నిష్పత్తి తగ్గడం ఆందోళన కలిగించే అంశమని వైద్యనిపుణులు చెబుతున్నారు.

- జిల్లాలో యథేచ్ఛగా భ్రూణహత్యలు
- లింగనిర్ధారణపై కొరవడిన నిఘా
- తగ్గిపోతున్న బాలికల నిష్పత్తి
- స్కానింగ్ కేంద్రాలపై చర్యలు శూన్యం
- మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు

నెల్లూరు(బారకాసు): ఆడపిల్లలను వద్దనుకుంటే రేపటి మన సమాజం అమ్మలేని అనాథ అవుతుంది. 2011 జనాభా లెక్కలతో పోల్చినపుడు 2021 నాటికి జిల్లాలో స్త్రీ, పురుషుల నిష్పత్తి కాస్త పెరిగినా 0–6 ఏళ్లలోపు బాలబాలికల నిష్పత్తి మాత్రం గణనీయంగా తగ్గినట్లు తెలుస్తోంది. 2011 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి 1000 మంది పురుషులకు.. 978 మంది మహిళలు ఉన్నారు. 2021 నాటికి మహిళల సంఖ్య 936గా నమోదైంది. జిల్లా విషయానికి వస్తే 2011లో 1000 మంది పురుషులకు.. 984 మంది స్త్రీలు ఉండగా, వీరిలో 0–6 ఏళ్ల లోపు ఉన్న ప్రతి 1000 మంది బాలురకు 955 మంది మాత్రమే బాలికలు ఉన్నారు. 2021 నాటికి ప్రతి 1000 మంది పురుషులకు.. 986 మంది మహిళలు ఉండగా, వీరిలో 0–6 ఏళ్ల లోపు ఉన్న ప్రతి 1000 మంది బాలురకు.. 945 మంది బాలికలు ఉన్నారు. బాలబాలికల నిష్పత్తిని పరిశీలిస్తే బాలికల నిష్పత్తి క్రమంగా తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. కాగా ప్రతి 1000 మంది బాలురకు.. 953 మంది బాలికలు ఉండాలని వైద్యారోగ్యశాఖ లెక్కలు చెబుతున్నాయి.

స్కానింగ్ సెంటర్లపై చర్యలేవీ?

జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు ఇష్టారీతిగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నాయి. దీంతో భ్రూణ హత్యలకు ఆస్కారం ఇచ్చినట్లవుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు ప్రభుత్వ అనుమతి పొందిన స్కానింగ్ కేంద్రాలు 197 ఉండగా మరికొన్ని కేంద్రాలు అనుమతి లేకుండానే పని చేస్తున్నాయి. వీటిపై నిఘా ఉంచాల్సిన జిల్లా వైద్యారోగ్యశాఖ ఆ దిశగా చర్యలు చేపట్టిన పరిస్థితి లేదు. గత డీఎంహెచ్‌ఓలు కొన్ని స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి తూతూమంత్రంగా చర్యలు చేపట్టారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న కొన్ని స్కానింగ్ కేంద్రాల్లో యథేచ్ఛగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలుస్తోంది. లింగనిర్ధారణ పరీక్షల అనంతరం ఆడ శిశువు అని తెలియగానే అబార్షన్‌లు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఉదయగిరి, ఆత్మకూరు, కందుకూరు, కావలి, నెల్లూరు నగరంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసుకున్న సొంత స్కానింగ్ కేంద్రాల్లో ఈ తరహా పరీక్షలు ఎక్కువగా జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పోర్టబుల్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలను ప్రభుత్వం నిషేధించినా కొన్ని ఆస్పత్రుల్లో వాటిని వినియోగిస్తున్నట్లు సమాచారం.





జిల్లా వైద్యారోగ్యశాఖ ఏర్పాటు చేసిన ప్రచార బోర్డు

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



స్కానింగ్ కేంద్రాల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేసినట్లు రుజువైతే వెంటనే కఠిన చర్యలు తీసుకుంటాం. స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. అనుమతి లేకుండా స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ పెంచలయ్య, డీఎంహెచ్‌ఓ, నెల్లూరు

కాసుల వేట

మొదటిసారి ఆడపిల్ల పుట్టిన వారిలో కొందరు లింగనిర్ధారణ పరీక్షలు చేయించుకుని మళ్లీ ఆడశిశువు అని తెలియగానే భ్రూణహత్యలకు ఒడిగడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాలో బాలికల నిష్పత్తి తగ్గిపోతోంది. లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న స్కానింగ్ కేంద్రాలపై చర్యలు తీసుకోవాల్సిన వైద్యారోగ్యశాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో ఈ సంఖ్య మరింత తగ్గే అవకాశం ఉందని, ఇది సమాజంలో ఆందోళన కలిగించే అంశమని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతిచెందిన ఎద్దు వద్ద బాధిత రైతు

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాక పడమటి పొలాలు తాటితోపుల వద్ద విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతిచెందిన ఘటన ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. బ్రాహ్మణక్రాకకు చెందిన పాజర్ల సుబ్బయ్య మేత నిమిత్తం తన ఎద్దును పడమటి పొలాలకు తీసుకెళ్లాడు. అక్కడ తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఎద్దు మేత మేస్తున్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ రూ.70 వేల వరకు ఉంటుందని సుబ్బయ్య తెలిపాడు. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం వల్లే ఎద్దు చనిపోయిందని బాధిత రైతు జలదంకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఐస్ అమ్ముకోవడానికి వెళ్లి..

- విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



బాలకోటయ్య మృతదేహం

ఉలవపాడు: బతుకుదెరువు కోసం ఐస్ అమ్ముకోవడానికి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన ఘటన మండల పరిధిలోని కరేడు పల్లెపాళెం వద్ద ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సింగరాయకొండ మండలం బింగినపల్లెకు చెందిన మేడిద బాలకోటయ్య (44) ఐస్ అమ్ముకుని జీవిస్తుంటాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆదివారం ఐస్ అమ్మడానికి కరేడు పెదపల్లెపాళేనికి టీవీఎస్ ఎక్సెల్‌పై బయలుదేరాడు. మధ్యలో ఉన్న రొయ్యల చెరువుల వద్ద వెళ్తున్న సమయంలో రోడ్డుపై 11 కేవీ విద్యుత్ వైరు పడి ఉంది. ఈ క్రమంలో వైరు కాలికి తగలడంతో బాలకోటయ్య విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. అతను ఐస్ విక్రయిస్తేనే ఆ కుటుంబం గడిచేది. ఈ పరిస్థితుల్లో మృతిచెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న కందుకూరు సీఐ నఫీజ్‌బాషా, ఎస్సై బాజిరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీకి వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ మంత్రి నారాయణకు తప్పిన ప్రమాదం

వెంకటాచలం: మాజీ మంత్రి పొంగూరు నారాయణకు మండలంలోని చెముడుగుంట పంచాయతీ సమీపంలో పవన్ కాలనీ వద్ద ఆదివారం ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు.. చెన్నై వైపు నుంచి నెల్లూరు వైపు నారాయణ తన కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో పవన్ కాలనీ వద్ద గేదెలు రోడ్డుపై పరుగెత్తున్నాయి. ఒక గేదె నారాయణ ప్రయాణిస్తున్న కారుకు బలంగా ఢీకొంది. దీంతో కారు ముందు భాగం దెబ్బతింది. ఎవరికీ గాయాలు కాలేదు. నారాయణ మరో కారులో నెల్లూరుకు వెళ్లారు.

గురుకులాల్లో పారదర్శకంగా ప్రవేశాలు

చిల్లకూరు: గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పారదర్శకంగా చేపట్టనున్నట్లు డీసీఓ వి.జయభారతి తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో చేరే విద్యార్థులకు ఆదివారం చిల్లకూరులోని గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించారు. చిల్లకూరు, వాకాడు, కోట, నాయుడుపేటలోని బాలుర గురుకుల పాఠశాలల్లో ఐదో తగరతిలో ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసి, నేరుగా దరఖాస్తు చేసుకున్న వారికి మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయించారు. ఈ క్రమంలో నాలుగు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 90 సీట్లను భర్తీ చేసినట్లు డీసీఓ తెలిపారు. గురుకుల పాఠశాలలు, కళాశాల ప్రవేశాల విషయంలో అవకతవకలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 117
లేయర్ (లైవ్)	: 95
బ్రాయిలర్ చికెన్	: 206
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 230
లేయర్ చికెన్	: 161



పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.12
పండ్లు	: రూ.5

చందమామ చెంతకు..

- ఈనెల 14న చంద్రయాన్-3 ప్రయోగం
- చంద్రుడిపై పరిశోధనలే లక్ష్యం
- రాకెట్ బరువు 640 టన్నులు



ప్రయోగానికి సిద్ధంగా ఉన్న ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్

సూళ్లూరుపేట: ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధన సంస్థ) మరో భారీ ప్రయోగానికి సిద్ధమైంది. చంద్రయాన్-3కి సర్వం సిద్ధమవుతోంది. సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ ద్వారా ప్రయోగాన్ని ఈనెల 14వ తేదీన నిర్వహించేందుకు సన్నాహాలు ముమ్మరం చేశారు. షార్‌లోని రెండో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్)లో రాకెట్ అనుసంధానం పనులు పూర్తి చేశారు. పీఎస్‌ఎల్‌వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగించగా.. అదే జీఎస్‌ఎల్‌వీ రాకెట్‌ను మాత్రం మూడు దశల్లోనే ప్రయోగిస్తారు. జీఎస్‌ఎల్‌వీ మార్క్-3 అత్యంత శక్తివంతమైన రాకెట్. మూడువేల కిలోల నుంచి ఆరువేల కిలోల బరువు కలిగిన ఉపగ్రహాలను సునాయాసంగా రోదసీలోకి తీసుకెళ్లగలదు. ఈ రాకెట్‌కు ముందుగా జీఎస్‌ఎల్‌వీ మార్క్-3 రాకెట్‌గా నామకరణం చేయగా. అయితే 2019లో చేసిన చంద్రయాన్-2 ప్రయోగం నుంచి ఎల్‌వీఎం3-ఎం1గా పిలుస్తున్నారు.

దశల వారీగా..

ఈ రాకెట్‌కు అత్యంత శక్తివంతమైన రెండు స్ట్రాపాన్ బూస్టర్లు ఉంటాయి. ఒక్కో దాంట్లో 200 టన్నుల ఘన ఇంధనం ఉంటుంది. రెండు స్ట్రాపాన్ బూస్టర్లలో ఉన్న 400 టన్నుల ఘన ఇంధనంతో మొదటి దశను పూర్తి చేస్తారు. 110 టన్నుల ద్రవ ఇంధనంతో (ఎల్-110)తో రెండో దశను, 25 టన్నుల క్రయోజనిక్ ఇంధనం (సీ-25)తో మూడో దశ ప్రయోగాన్ని పూర్తి చేసే విధంగా రూపొందించారు.



మొదటి దశలోని ఎస్-200, ఎల్-110 దశలను అమర్చుతూ..

ఎల్‌వీఎం-3 రాకెట్ సిరీస్‌లో ఇది ఏడో ప్రయోగం. ఇప్పటి వరకూ అన్నీ విజయవంతం అయ్యాయి. ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ 640 టన్నులు బరువు కలిగి ఉంటుంది. 3,900 కిలోల బరువు కలిగిన చంద్రయాన్-3 ఉపగ్రహంలో మూడు విభాగాలుగా ఉండడంతో దీన్ని త్రీ ఇన్ వన్ మిషన్‌గా సంబోధిస్తున్నారు. ప్రయోగం తర్వాత చంద్రయాన్-3 మిషన్ సెప్టెంబర్ 6 వరకు 3.5 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించి చంద్రుడి కక్ష్యలోకి చేరుతుంది. ప్రపోల్షన్ మాడ్యూల్‌కు అనుసంధానం చేసిన ల్యాండర్ చంద్రుడికి 30 కిలోమీటర్ల ఎత్తులో విడిపోతుంది. అక్కడి నుంచి ల్యాండర్ నెమ్మదిగా జాబిల్లిపై దిగుతుంది. ఆ తర్వాత అందులో అమర్చిన రోవర్ బయటకు వచ్చి పరిశోధనలను ప్రారంభించి సమాచారాన్ని భూ నియంత్రిత కేంద్రానికి అందిస్తుంది.



రాకెట్‌లోని ఎస్-200, ఎల్-110 దశలను పూర్తి చేసి క్రయోజనిక్ దశను అమర్చేందుకు సిద్ధం చేసిన దృశ్యం



ఉపగ్రహానికి హీట్‌షీల్డ్ అమర్చిన దృశ్యం

యువగళం.. గందరగోళం

- బోగోలు మండలంలో పాదయాత్ర
- జనం నుంచి స్పందన కరువు
- ఐదు గంటలు ఆలస్యంగా మొదలు

బిట్రగుంట: మండలంలో యువగళం పాదయాత్ర రెండో రోజు ఆదివారం గందరగోళంగా సాగింది. ప్రజా స్పందన కనిపించకపోవడంతో ముందుగా నిర్ణయించిన షెడ్యూల్‌ను అకస్మాత్తుగా మార్చడం.. ఆ తర్వాత కూడా సుమారు ఐదు గంటలు ఆలస్యంగా యాత్ర ప్రారంభించి హడావుడిగా ముగించారు. తీవ్ర జాప్యం కారణంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన టీడీపీ కార్యకర్తలు కూడా అసహనానికి గురయ్యారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పాదయాత్ర ఉదయం 9 గంటలకు తాటిచెట్లపాళెం నుంచి జువ్వలదిన్నె వడ్డిపాళెం మీదుగా జరగాలి. కాగా ముందురోజే జనాల స్పందన అంతంతమాత్రంగా ఉండడంతో షెడ్యూల్‌ను ఆకస్మాత్తుగా మార్చారు. ఉదయం 9 గంటలకు కాకుండా మధ్యాహ్నం రెండు గంటలకు యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం కూడా షెడ్యూల్ ప్రకారం యాత్ర మొదలు కాలేదు. జువ్వలదిన్నె వడ్డిపాళెం చేరుకునే సరికి సాయంత్రం 5.20 గంటలు అయ్యింది. అప్పటికి కూడా ప్రజలు పెద్దగా లేకపోవడం, యాత్ర తీవ్ర జాప్యం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన కార్యకర్తలు కూడా విసిగిపోయారు. తర్వాత వడ్డిపాళెం మీదుగా జువ్వలదిన్నె చేరుకుని అమరజీవి స్మారక భవనాన్ని సందర్శించారు. అనంతరం చిప్పలేరు మీదుగా కావలి రూరల్ మండలంలోకి ప్రవేశించారు. ఎక్కడ కూడా పట్టుమని పది నిమిషాలు కూడా ప్రసంగించకపోవడంతో సొంత పార్టీ కార్యకర్తలు కూడా విస్మయానికి గురై ఉసూరుమన్నారు.



జువ్వలదిన్నెలో లోకేశ్ పాదయాత్ర

పరువు దక్కిందంటూ..

తీరంలో కూడా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, ఆటోలు, కార్లలో బయట నుంచి తరలించిన వ్యక్తులు తప్ప స్థానికుల నుంచి కొంచెం కూడా స్పందన కనిపించకపోవడంతో పార్టీ కార్యకర్తల్లో కూడా కలవరం మొదలైంది. జువ్వలదిన్నె వద్దకు వచ్చే సరికి పెనుగొండమ్మ తిరునాళ్లకు వేలాదిగా హాజరైన జనం రోడ్లపైనే ఉండడంతో కాస్త రద్దీ కనిపించింది. పెనుగొండమ్మ వార్షిక తిరునాళ్లకు జిల్లాతోపాటు చుట్టపక్కల జిల్లాల నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలిరావడంతో అప్పటికే జువ్వలదిన్నె జనంతో కిక్కిరిసిపోయింది. ఈ జన సందోహం మీదుగా లోకేశ్ పాదయాత్ర సాగడంతో పచ్చపార్టీ ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పరువు దక్కిదంటూ హడావుడిగా కెమెరాలకు పని చెప్పారు.

కళ్ల ముందే తిరిగాడు.. కాసేపటికే..

- నీటిగుంతలో పడి బాలుడి మృతి
- గొలగమూడిలో విషాదం



బాలుడు చనిపోయిన నీటి గుంత

వెంకటాచలం: 'ఆ బాలుడు అప్పటి వరకు తల్లిదండ్రుల కళ్ల ముందు తిరిగాడు. వీధిలోకి వెళ్లి పిల్లలతో ఆడుకున్నాడు. కాసేపటికి నివాసాలకు సమీపంలోని నీటిగుంత వద్దకు వెళ్లాడు. ఈత రాకపోవడంతో మునిగిపోయి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు'. ఈ విషాదకర ఘటన మండలంలోని అనికేపల్లి పంచాయతీ గొలగమూడిలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గొలగమూడి గ్రామానికి చెందిన మౌలాలీ, ఆయేషా దంపతులకు కుమార్తె జాస్మిన్, కుమారుడు హిమాయితుల్లా (7) ఉన్నారు. మౌలాలీ బైక్ మెకానిక్. జాస్మిన్ మూడో తరగతి, హిమాయితుల్లా గొలగమూడి ఆశ్రమ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నారు. ఆదివారం హిమాయితుల్లా తన నివాసం పక్కనున్న పిల్లలతో కలిసి మధ్యాహ్నం వరకు ఆడుకున్నాడు. తర్వాత మరో నలుగురు పిల్లలతో కలిసి సమీపంలోని నీటిగుంతల వద్దకు వెళ్లాడు. అందరి కంటే ముందుగా అతనే గుంతలోకి దిగగా లోతు ఎక్కువగా ఉండడంతో మునిగిపోయాడు. తోటి పిల్లలు పెద్దగా కేకలు వేస్తూ నాగులవరం కాలనీవాసులకు, గొలగమూడి గ్రామస్తులకు చెప్పారు. దీంతో అందరూ కలిసి గుంత వద్దకు చేరుకుని నలువైపులా దిగి వెతికి హిమాయితుల్లాను బయటకు తీశారు. అయితే అప్పటికే మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదించారు.



బాలుడి మృతదేహం

స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంకటాచలం సీఐ గంగాధరరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నేతల చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

కోవూరు: టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద రవికుమార్ ఆ పార్టీకి రాజీనామా చేసి స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో ఆదివారం కోవూరులోని తూర్పు ఎస్సీకాలనీలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే టీడీపీకి చెందిన మరో వందమంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులై రవికుమార్ వైఎస్సార్‌సీపీలో చేరడం శుభపరిణామమన్నారు. కోవూరు నియోజకవర్గంలోని టీడీపీ నేతలు అత్యధిక శాతం మంది వైఎస్సార్‌సీపీలో చేరిపోయారని, మిగిలిన వారు కూడా త్వరలోనే చేరుతారని తెలిపారు. రెండు రోజులుగా పింఛన్లు తొలగించారంటూ టీడీపీ నాయకులు పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి శాశ్వత ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ నల్లపరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలు మానవత్వాన్ని చాటుతున్నాయన్నారు. ఇటీవల జరిగిన యువగళం పాదయాత్రలో టీడీపీ నేత నారా లోకేశ్ ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. పార్టీలో చేరిన రవికుమార్ మాట్లాడుతూ తనపైన నమ్మకం ఉంచి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కోవూరు నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, ఎంపీఏబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, నాయకులు చిరంజీవి, విజయకుమార్, కిశోర్‌సింగ్, ప్రసాద్, గంగవరం సర్పంచ్ లక్ష్మీకుమారి, అంజనరావు, మల్లికార్జున, శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- 2024లో వైఎస్ జగన్‌ను ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధం
- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల(సోమశిల): ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి దాని ప్రకారం పనిచేస్తున్నట్లు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పాతదేవరాయపల్లి, ముత్తుకూరుల్లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల వల్ల జరిగిన లబ్ధిని వివరించి బుక్‌లెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన గ్రామంలో పర్యటించారు. ప్రజలు పలు సమస్యలను చెప్పగా.. అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరిస్తానన్నారు. ఓ దివ్యాంగుడు తన సమస్యను తెలియజేయగా వెంటనే జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో సీసీ రోడ్ల కోసం ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. తర్వాత జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణాలను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అగ్రస్థానంలో రాష్ట్రం

ఈ సందర్భంగా విక్రమ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడుతున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలు సులభంగా పరిష్కారమవుతున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఏమైనా సమస్యలుంటే వలంటీర్ల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వ అధికారులతోపాటు తన కార్యాలయం కూడా ప్రజలకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పనిచేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, జేసీఎస్ కో-ఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బట్రెడ్డి జనార్దనరెడ్డి, అనంతసాగరం సర్పంచ్ శోభ, బొమ్మవరం సర్పంచ్ లక్ష్మీదేవి, ఈశ్వరయ్య, ఎస్కే ఖాజా మొహిద్దీన్, ఎస్కే యస్దాని, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ప్రభుత్వ గుర్తింపు కలిగిన పారామెడికల్ డిప్లొమా కోర్సులకు 2023-2024 సం॥నకు అడ్మిషన్లు జరుగుచున్నవి. DMLT (మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ) DOA (ఆప్తాల్మిక్ అసిస్టెంటు), DRGA (రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్) అర్హత: ఇంటర్, స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు. పరమేశ్వరి కాలేజ్ ఆఫ్ పారామెడికల్ సైన్సెస్, ఒంగోలు. ✆ 72075 55666, 96408 24225 [OA-979]

DIRECT FINAL YEAR

■Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629 [T-4430]

REAL ESTATE

BUILDING FOR SALE

■గూడూరులో కటకరాజ వారి వీధి నందు NTR విగ్రహం ప్రక్కన తూర్పు ఫేసింగ్ కమర్షియల్ బిల్డింగ్ అమ్మకమునకు కలదు. వివరాలకు సంప్రదించండి: 98869 24798. [NA-22302]

PLOT FOR SALE

■నెల్లూరు రైల్వేస్టేషన్‌కు 9 కి.మీ. దూరంలో నరుకూరు సెంటర్‌కు అతిసమీపంలో అంకణం 45 వేలు మరియు నరుకూరు సెంటర్ SBI ఎదురుగా అంకణం 70వేలకే ప్లాట్‌లు అమ్మబడును. సెల్: 62814 11178, 91214 52347. [NA-10859]

■నెల్లూరు బాలాజీనగర్ పుట్టావీధిలో చిల్డ్రన్స్ పార్కు దగ్గర పడమర ఫేస్ గల 10 1/2 అం॥ల స్థలం అమ్మబడును. వివరాలకు సంప్రదించండి. సెల్: 81259 58159. [NA-22308]

■పోర్ట్ సిటీగా డెవలప్ అవుతున్న మన రామాయపట్నంకి అతిదగ్గరలో ఉడా అప్రూవల్ గల మన వెంచర్ నందు ప్లాట్స్ కలవు - స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం తో ✆ 95425 52299 [O-787278]

TO-LET

■Commercial Space in First Floor (2500 Sft) available for rent opposite to KVR Petrol Bunk, Nellore. Further Details Contact : 98853 58597. [NA-5742]

■లేక్‌వ్యూ కాలనీ, పొదలకూరు రోడ్డు నందు 3BHK, కార్ పార్కింగ్ మరియు గార్డెన్ గల ఇల్లు, 1st ఫ్లోర్ నందు అద్దెకు కలదు. వివరాలకు సంప్రదించండి : 91820 44651. [N-785268]

SERVICES

GOLD FINANCE

■బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి, ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును.స్పాట్‌క్యాష్ ✆ 99121 05656 [B-308]

■బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-781990]

■బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2406]

■బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి ఈరోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ (100% జెన్యూన్) ✆ 945 945 3338. [B-297]

WANTED

■Wanted Receptionist, Tele Callers Service advisers, Sales Girls and Boys etc. Cont: 74163 01858, 70752 61858. [NA-5752]

■Wanted V Softech HR Solutions Software job openings for graduates. freshers can apply. Golden Chance for unemploys. 93903 12864, 83320 71165. [NA-5753]

■The Supreme industries limited (xf division) Req: Sales Executieve for ongole and nellore region Qul: Degree & Above, exp: 2+ in FMCG and allied industry mail to karansing_bondili@supreme.co.in. Contact: 7337364611 [G-787566]

■నెల్లూరు టౌన్‌లో కూలింగ్ వాటర్ ప్లాంట్ నందు వాటర్‌క్యాన్లు డెలివరి చేయుటకు ఆటో డ్రైవర్లు, హెల్పర్లు కావలెను. జీ: 12000 - 15000. ఉచిత వసతి కలదు. 91820 08306. [NA-22306]

■బ్యాంక్ లోన్స్ ప్రాసెస్ నందు Tele Caller కావలెను. Married Female, టార్గెట్స్ లేవు. జీతం: 12000/-. ట్రంక్ రోడ్డు, నెల్లూరు. వివరాలకు సంప్రదించండి: 88858 02000. [NA-22300]

■V Hospitality Services: హోటల్ మేనేజ్‌మెంట్ శిక్షణ మరియు ఉద్యోగ అవకాశాలు. 100% జాబ్ Guarany. కనీస అర్హత : 10th above. Cell: 91006 26998, 99890 39051. [NA-5754]

■నెల్లూరు NUDA Approval Plots మార్కెటింగ్ చేయుటకు బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్, మేనేజర్లు, ఏజెంట్లు మరియు Rtd Govt. Employees కావలెను.Sal: 25K+ కమీషన్. 98858 44445. [NA-10858]

■నెల్లూరు, అయ్యప్పగుడి దగ్గర ఫుడ్ కాంప్లెక్స్ లోని ప్లైవుడ్ అండ్ హార్డ్‌వేర్ షాపు నందు పని చేయుటకు M/F అభ్యర్థులు కావలెను. వివరాలకు సంప్రదించండి. సెల్: 80192 92442. [NA-10857]

■నెల్లూరు శ్రీ తిరుమల ఆటోఫైనాన్స్ నందు వర్క్ చేయుటకు (లేడీస్ & జంట్స్) అకౌంటెంట్ కావలెను. జీతం15,000/- మరియు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 15,000/- పెట్రోలు 4000/- 9100960679 [G-7252]

■TTD నందు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయుటకు హౌస్ కీపింగ్ Staff కావలెను, జీతం: 10,000 + PF + ESI + Bus Pass, M/F, Age: 45 లోపు, 7997945161, 8297797197. [T-4425]

■ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలో ONROLE Jobs కలవు. ఆకర్షణీయమైన జీతం. Qua: ఏదైనా డిగ్రీ. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత. ✆ 9440351657. [T-1191458]

■హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ:18K. హైదరాబాద్ Ph: 9640258899, విజయవాడ Ph:9640648899 [H-189305]

■కష్టలేన్స్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12000-35000/- ఫ్రీ రూమ్ + భోజనం. Hyd. ఫోన్ : 7995374999. [HA-395]

■విష్ణుప్రియ TVS షోరూం MG మాల్ ప్రక్కన దర్గామిట్టలో పని చేయుటకు వర్క్‌షాప్ సూపర్‌వైజర్స్ (Qlf: B.Tech లేదా డిప్లొమా), స్పేర్ పార్ట్స్ అసిస్టెంట్స్, లేడి టెలికాలర్స్ కావలెను. Age: 30 సం॥ లోపు. ఇంటర్వ్యూ : 3 PM to 5 PM. నెల్లూరు టౌన్ వారికి ప్రాధాన్యత. వివరాలకు సంప్రదించండి : 93816 76346 [NA-22307]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును.

ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.

సాక్షి క్లాసిఫైడ్స్‌కు సంప్రదించండి

నాలుగు లైన్లకు ₹ 320/-, అదనపు లైనుకు ₹80/-

కలర్ ప్రకటనకు 25% అదనం

నెల్లూరు 90 1000 66 11